సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 6 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,060

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.69,000

రిటైల్ వెండి గ్రాము రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	29	19
తిరుపతి	29	20
తిరుమల	24	16
గూడూరు	30	22
నగరి	30	21



తెప్పలపై విహారం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం సాయంత్రం శ్రీచండికేశ్వరస్వామి, శ్రీచంద్రశేఖరస్వామి వారు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

న్యూస్‌రీల్

బాబుకు మతిపోయింది!

– జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు కార్పొరేషన్: చంద్రబాబుకు మతి పోయిందని, ప్రచారం కోసం అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఆయన ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం వి.కోటలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అసమర్థ నాయకుడిగా బాబుకు గిన్నిస్‌బుక్‌లో చోటు ఇవ్వవచ్చన్నారు. రాష్ట్రంలో పోలీసుయాక్ట్ ఉందని, కుప్పంలో సభ జరపవద్దని చంద్రబాబు పీఏకు పోలీసులు నోటీసులు ఇచ్చినా వారు స్పందించలేదన్నారు. బయట ప్రాంతాల నుంచి గుండాలను తెప్పించుకుని కుప్పంలో పోలీసులను ఎదిరించి, ప్రజలను భయాందోళనకు గురిచేశారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న మీరు కుప్పానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డిని ప్రతిసారి టార్గెట్ చేయడం సరికాదన్నారు. కుప్పంలో అక్రమాలు జరుగుతున్నాయని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ అబ్బాయి పప్పు(లోకేష్) చేసిన అవినీతి అందరికీ తెలుసన్నారు. హైటెక్ సిటీ సమీపంలో వందల ఎకరాలు టీడీపీ నాయకులు దోచుకుని రియల్‌ఎస్టేట్ చేశారని ఆరోపించారు. జిల్లా పెద్దిరెడ్డి అడ్డా అని రానున్న ఎన్నికల్లో కుప్పంలో బాబు ఓడిపోతారని జోష్యం చెప్పారు. టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు అని, బాబు ఇక హైదరాబాద్‌లో తన నివాసానికి పరిమితమవుతారన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు మరో అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్‌స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహించే అడ్మిషన్లకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది, ఇంటర్ కోర్సులకుగాను 2022–23 సంవత్సరంలో అడ్మిషన్లకు తత్కాల్ ప్రాతిపదికన ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 8వ తేదీలోపు అర్హత, ఆసక్తి ఉన్న వారు అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అపరాధ రుసుం పదో తరగతికి రూ.400, ఇంటర్‌కు రూ.500 ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సంబంధిత ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, డీఈఓ కార్యాలయంలో ఉన్న ఓపెన్‌స్కూల్ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కొండకు రోజూ 1400 ట్రిప్పులు

తిరుపతి అర్బన్: న్యూ ఇయర్, వైకుంఠ ఏకాదశి పర్వదినాల సందర్భంగా తిరుమల కొండకు భక్తుల రద్దీ పెరిగిందని, ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ వరకు అదనపు బస్సు సర్వీసులు నడుస్తాయని జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్ రెడ్డి గురువారం తెలిపారు. రోజూ సరాసరి 94 వేల మంది భక్తులను కొండకు తరలిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నుంచి 1,400 ట్రిప్పులు తిరుమలకు నడుపుతున్నట్లు వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌లో రోజూ 1,130 ట్రిప్పులు నడిపినట్టు ఆయన గుర్తుచేశారు.

ఆధ్యాత్మికం.. ఆత్మీయం



తిరుమలలో స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న గవర్నర్ దంపతులు



తిరుపతిలో గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి



రేణిగుంటలో గవర్నర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు రజని, ఆర్కే రోజా, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం ఆధ్యాత్మికానందంలో మునిగితేలారు. ముందుగా ఆయన రేణిగుంట ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బాలాజీ మెడికల్ కాలేజీలో 2022–23 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ బ్యాచ్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుపతికి చేరుకున్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన, ఆడిటోరియం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కుటుంబ సమేతంగా తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.

– తిరుమల

ఆమే కీలకం



విద్య..వైద్యం..పారిశ్రామికం.. రాజకీయం ఇలా ఏ రంగంలోనైనా పైచేయిగా ఉన్న అతివలు నేడు ఓటరు జాబితాలోనూ తమ ఆధిక్యతను కొనసాగించారు. ఈ నెల 5వ తేదీన విడుదల చేసిన తుది జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఫలితంగా వచ్చే సాధారణ ఎన్నికల్లో వారే కీలకం కానున్నారు.



- సాధారణ ఎన్నికల తుది ఓటర్ల జాబితా విడుదల
- మహిళా ఓటర్లే అధికం
- 7 నియోజకవర్గాల్లో మొత్తం 7,77,839 మంది



తుది ఓటరు జాబితా కసరత్తును పర్యవేక్షిస్తున్న డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా ఎంతో కీలకం. గతంలో ఓటరు జాబితా సవరణ సంవత్సరానికొకసారి నిర్వహించి, తుది ఓటర్ల జాబితాను విడుదల చేసేవారు. అయితే ప్రస్తుతం సంవత్సరంలో నాలుగు సార్లు ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జనవరి , ఏప్రిల్ , జూలై , అక్టోబర్ 1 తేదీల్లో ఏటా ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. గతంలో ఏడాదికి ఒక్కసారే 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఇకపై సంవత్సరంలో జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే నెలల్లో ఓటర్ల సంక్షిప్త సవరణ కసరత్తును అధికారులు నిర్వహిస్తారు. 17 ఏళ్లు నిండిన వారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. అయితే 18 సంవత్సరాలు నిండిన వెంటనే వారి ఓటు హక్కును బీఎల్‌వోలు ఆన్‌లైన్‌లో ఆమోదిస్తారని అధికారులు వెల్లడిస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీన కలెక్టర్ హరి నారాయణన్ తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్ కసరత్తును పర్యవేక్షించారు. తుది ఓటర్ల జాబితాను ఆయా మండలాలకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు పంపేలా కలెక్టరేట్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తుది ఓటర్ల జాబితా ఇలా...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
పుంగనూరు	1,17,171	1,19,223	19	404	2,36,413
నగరి	1,00,062	1,04,152	7	144	2,04,221
జీడీ నెల్లూరు	1,02,604	1,02,249	9	499	2,04,862
చిత్తూరు	98,436	1,01,867	45	919	2,01,348
పూతలపట్టు	1,09,644	1,10,196	13	1,112	2,19,853
పలమనేరు	1,29,067	1,30,412	0	248	2,59,479
కుప్పం	1,11,322	1,09,740	20	202	2,21,182
మొత్తం	7,69,306	7,77,839	113	3,528	15,47,258

అత్యధికంగా మహిళా ఓటర్లే..

జిల్లాల పునర్విభజన అనంతరం మొదటిసారి సాధారణ ఎన్నికల సంక్షిప్త సవరణ కసరత్తు నిర్వహించారు. నూతన చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఉన్న 7 నియోజకవర్గాల్లో కసరత్తు పకడ్బందీగా చేపట్టారు. ప్రచురించిన తుది జాబితా ప్రకారం 7 నియోజకవర్గాల్లోని 31 మండలాల్లో సాధారణ ఎన్నికలకు 15,47,258 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో మహిళలే అధికంగా ఉన్నట్లు వెల్లడించారు. పురుషులు 7,69,306 మంది ఉండగా, మహిళలు 7,77,839 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఇతరులు 113 మంది, సర్వీస్ ఓటర్లు 3,528 మంది ఉన్నట్లు తుది ఎన్నికల జాబితాలో పేర్కొన్నారు.

2019 ఎన్నికల్లో 15,00,702 మంది ఓటర్లు

2019లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం మొత్తం 7 నియోజకవర్గాల్లో 15,00,702 మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం 2023 జనవరి 5 నాటికి 46,556 మంది ఓటర్లు పెరిగారు. కాగా ప్రస్తుతం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో 2,59,479 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా చిత్తూరు నియోజకవర్గంలో 2,01,348 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సర్వీసు ఓటర్లు అత్యధికంగా పూతలపట్టు నియోజకవర్గంలో 1,112 మంది, అత్యల్పంగా నగరి నియోజకవర్గంలో 144 మంది ఉన్నారు.

ఓటరు జాబితా కీలకం



“ ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా కీలకమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తాం. జిల్లాల్లో సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాం. ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ మేరకు కసరత్తు చేసి, ఓటర్ల తుది జాబితా రూపొందించాం. ఓటర్ క్లెయిమ్స్ పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఈ నెల 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాం.

– హరి నారాయణన్, కలెక్టర్, చిత్తూరు

ఆర్‌అండ్‌బీ స్థల ఆక్రమణకు టీడీపీ యత్నం



గొల్లపల్లెలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు: మండలంలోని గొల్లపల్లెలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని చదును చేసి, ఆక్రమించుకోవడానికి అక్కడి టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నేతలు భాస్కర్, నారాయణప్ప, సుబ్రమణ్యం, రామకృష్ణ తదితరులు రోడ్డు పక్కన జేసీబీతో చదును చేస్తుండగా తహసీల్దార్ కుప్పుస్వామి తన సిబ్బందితో వెళ్లి ఆ పనులను అడ్డుకుని, నిలిపివేయించారు. అయినా వినని వారు మళ్లీ అక్కడ పనులు చేయడంతో అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడ పనులను అడ్డుకున్నారు. ఏదేమైనా టీడీపీ నాయకులు కావాలనే నిబంధనలను పాటించడం లేదని తహసీల్దార్ తెలిపారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు సైతం సమాచారాన్ని ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

జేసీఎస్ కో–ఆర్డినేటర్ల నియామకం

తిరుపతి మంగళం : జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల కో–ఆర్డినేటర్లను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. ఆమేరకు పుత్తా శివశంకర్‌రెడ్డి తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు అన్నమయ్య, ఎస్‌ఆర్‌ఎస్‌పీ నెల్లూరు, ప్రకాశం జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

నిలకడలేని టమాట



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

కాలం కలిసొచ్చి.. దిగుబడితోపాటు ధర ఉంటేనే కర్షకుడికి కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. అయితే టమాట ధర ఏ రోజు ఎలా ఉంటుందో.. తెలియదు. గత నెల మొదటి వారంలో కాస్త ఊరట నిచ్చిన ధర నెలాఖరుకు బాక్స్ రూ.వందకు పడిపోయింది. మళ్లీ గత సోమవారం కాస్త ఊరటనిచ్చి బాక్స్ రూ.250 పలకగా గురువారంరూ.210కి పడిపోయి ఉసూరుమనిపించింది. ఇలా టమాట ధర నిలకడ లేకుండాపోతోందని పుడమిపుత్రులు ఆవేదన చెందుతున్నారు.

- మళ్లీ పుంజుకుంటున్న ధరలు
- ప్రస్తుతం బాక్సు టమాట ధర రూ.250
- భారీగా తగ్గిన టమాట ఎగుమతులు
- జిల్లాలోని మార్కెట్లకు రాని బయటి వ్యాపారులు

పలమనేరు: జిల్లాలో టమాట ధరలు పడిలేస్తున్నాయి. ఎప్పుడు ధర పెరుగుందో..ఎప్పుడు తగ్గుముఖం పడుతుంతో అర్థం గాని పరిస్థితి నెలకొంది. గత నెలలో బాక్సు(14 కిలోలు) రూ.500పైగా ఉన్న ధరలు డిసెంబరు మొదటి వారానికి రూ.350కి పడిపోయి రెండో వారంలో రూ.150కి దిగజారాయి. మూడో వారంలో కొంత పుంజుకుని బాక్సు ధర రూ.250కి చేరుకుంది. వారం రోజులుగా వందకు పడిపోయిన ధర మళ్లీ పుంజుకుంది. ఆ మేరకు సోమవారం బాక్సు ధర రూ. 250కి పెరిగింది.

లోకల్‌గా సరుకు తగ్గినా..

జిల్లాలోని పడమటి మండలాల్లో సీజన్‌తో సంబంధం లేకుండా టమాటను రైతులు సాగి చేస్తుంటారు. పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వి.కోట, సోమల, సదుంలో టమాట మార్కెట్లున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతంలో ఎక్కువగా టమాట పండుతుంటే ధరలు తగ్గుముఖం పట్టేవి. ప్రస్తుతం జిల్లాలో టమాట పండే ప్రాంతాల్లో భారీగా సరుకు తగ్గింది. అయినప్పటికీ ధర ఆశించిన మేరకు ధర పెరగకపోవడం గమనార్హం.

గత నెలలో టమాట ధర వివరాలిలా....

- మొదటివారంలో బాక్సు(14 కిలోలు): రూ.350
- రెండోవారంలో రూ.150
- మూడోవారంలో రూ.250
- నాలుగోవారంలో రూ.100
- సోమవారం నాటి ధర రూ.250
- మంగళవారం నాటి ధర రూ.250
- బుధవారం, గురువారం నాటి ధర రూ.210

ఎక్కడి రాష్ట్రాల్లో అక్కడే సరుకు...

ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి ఎక్కువగా టమాటను తమిళనాడు, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, వెస్ట్‌బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు చేసేవారు. అయితే ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లోనే లోకల్ సరుకు కావాల్సినంత అందుబాటులో ఉంది. దీంతో ఆ రాష్ట్రాలకు ఇక్కడి సరుకు ఎగుమతి చేయడం లేదు. కేవలం తమిళనాడులోని చెన్నై, ఆర్కాడ్, వేలూరు, కోయంబత్తూరుకు మాత్రమే టమాటను కొంత మేర ఎగుమతి చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు సరుకును విక్రయించే వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు రావడం లేదు. గత వారంలో బయటి వ్యాపారులు మళ్లీ మార్కెట్లకు రావడంతో ధరలు పుంజుకున్నా, మళ్లీ పడిపోయాయి.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలివీ..

టమాట ఈ సీజన్‌లో సాధారణ సాగు:
5వేల హెక్టార్లు

ప్రస్తుతం సాగైన పంట:
800 వందల హెక్టార్లు

ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు :
450 హెక్టార్లు

ఏటా సీజన్‌లో మండీలకు సరుకు:
150 లారీ లోడ్లు

ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు:
50 లోడ్లు

బాక్సు రూ.300 పలికితే రైతుకు గిట్టుబాటు



నేను సీజన్‌తో సంబంధం లేకుండా ఏటా టమోటాను సాగు చేస్తుంటా. నాలుగెకరాల్లో టమాట నాటాను. పెరిగిన కూలీలు, పంట సాగుకు పెట్టుబడులు, వర్షాల నేపథ్యంలో బాక్సు ధర రూ.300 పైగా ధరలుంటే రైతుకు మిగులుతుంది. సరుకున్నప్పుడు ధర పలకడంలేదు.

– కుమార్, టమాట రైతు, రామాపురం, పలమనేరు మండలం

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ధరలు ఆశాజనకంగా ఉండొచ్చు.



ప్రభుత్వం ఈ ప్రాంతంలో పలుచోట్ల ఆపరేషన్ గ్రీన్ ప్రాజెక్టులో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్మిస్తోంది. ఇవి ఇప్పటికే కొన్ని అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు పండించిన టమటాను ఇక్కడి యూనిట్లలో విక్రయించుకోవచ్చు. దీంతో డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా ధరలు పెరిగే అవకాశం ఉంటుంది.

–డా. కోటేశ్వరావు, ఉద్యానశాఖ సహాయసంచాలకులు

కచ్చితంగా ధర ఉంటుందని చెప్పలేం



ఏటా సీజన్ ప్రకారం ధరలుండడంలేదు. ఏ నెలలో ధరలు ఎలా ఉంటాయో అంతు చిక్కడం లేదు. గత ఏడాది ఈ సీజన్‌లో ధరలున్నాయి ఈ దఫా కూడా ఉంటాయని ముందుగా ఊహించలేని పరిస్థితి నెలకొంది. మొత్తం మీద టమాట ధరలు బయటి రాష్ట్రాల్లో డిమాండ్ ఆధారంగా హెచ్చుతగ్గులుంటాయి. ఉన్నట్టుండి ఇప్పుడు మళ్లీ ధర పెరిగింది.

– అఫ్జల్ అలీ, టమాట మార్కెట్ మండీ యజమాని, పలమనేరు

రుణమాఫీ పేరుతో బాబు టోపీ



సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- 'పల్లెబాట'లో మంత్రి పెద్దిరెడ్డి ధ్వజం

చౌడేపల్లి (సోమల): 'దశాబ్దానికి పైగా ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఎన్నికల హామీలను గాలికొదిలేశాడు. ఓట్ల కోసం రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రజలకు టోపీ పెట్టేశాడు. ఇప్పుడు మళ్లీ మొసలి కన్నీరు కారుస్తూ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాడు.. ఇలాంటి వ్యక్తి రాష్ట్రానికి అవసరమా..?' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం పుంగనూరు నియోజకవర్గం, సోమల మండలపరిధిలోని అన్నెమ్మగారిపల్లె, తేటూరు, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, పంచాయతీల పరిధిలోని 48 పల్లెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో టీడీపీ నేతలు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. కరోనాకి ముందు ప్రతి గ్రామంలో ఏడాదికి రెండు సార్లు తిరిగి సమస్యలు పరిష్కరించేవాడినని, కరోనా తరువాత ఇది రెండో పల్లెబాట కార్యక్రమమని తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పుంగనూరు నియోజకవర్గం అనూహ్యంగా అభివృద్ధి చెందిందని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చినగొప్ప నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని తెలిపారు. పేద విద్యార్థులు అభివృద్ధి చెందలానే లక్ష్యంతో అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ఆరోగ్యశ్రీకింద ఉచిత వైద్యంతో పాటు ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లాక కూడా కొండంత అండగా నిలబడుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాజకీయ నాయకులు ఓట్లు వేసే వారికి మాత్రమే పథకాలు అందించేవారని, కానీ ఓటు గురించి ఆలోచించకుండా అందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి సొంతమని తెలిపారు. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపనుందని తెలిపారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి దగా చేశారని, మహిళలు, రైతు రుణాలు మాఫీ అని చెప్పి మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని విరుచుకుపడ్డారు. ఇది కరువు పీడిత ప్రాంతమనే ఉద్దేశంతో గండికోట నీటిని హంద్రీ–నీవా ద్వారా అందించేందుకు సీఎం వైఎస్ జగన్ సిద్ధమయ్యారని తెలిపారు. ఇప్పటికే ముదివేడు, సుగాలిమిట్ట, అవులపల్లిలో ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్టు తెలిపారు.



నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

ఆట.. పాటలకు సై

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో పద్మతరంగ్ పేరుతో నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం విద్యార్థినీ విద్యార్థులు పలు పోటీల్లో తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. యువతీయువకులు తమ కళానైపుణ్యాలతో ప్రేక్షకులను అలరింపజేశారు. చదువుతో పాటు ఆట పాటలకు సై అంటూ చక్కటి అభినయం, హావభావాలతో అదరహో అనిపించారు. వివిధ యూనివర్సిటీల విద్యార్థినీ విద్యార్థులు రాజ్యాంగాన్ని కాపాడాలి, లింగ సమానత్వం, మహిళల రక్షణ వంటి అంశాలతో స్కిట్లను అద్భుతంగా ప్రదర్శించి, ఆలోచనలు రేకెత్తించారు. అలాగే భరతమాత వైభవాన్ని చాటుతూ విద్యార్థినులు ఆలపించిన బృంద గీతం ఆకట్టుకుంది. అలాగే పాశ్చాత్య సంగీతాన్ని ఆలపించడంతో పాటు పాశ్చాత్య వాయిద్యా విన్యాసాలను ప్రదర్శించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన ఈ యువజనోత్సవాల్లో క్విజ్, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ, జానపద నృత్యాలు, బృంద గానం, మ్యూజిక్ షో తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ వర్సిటీలకు చెందిన సుమారు 53 బృందాలు పాల్గొని, తమదైన శైలిలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ జమున, రిజిస్ట్రార్ ఎం.రజిని, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


యువజనోత్సవంలో గానాలాపన చేస్తున్న విద్యార్థినులు


సాత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో గానం చేస్తున్న విద్యార్థులు

ప్రజల ప్రాణాలతో టీడీపీ రాజకీయాలు

- బాబూ నీ 40 ఏళ్ల అనుభవం ఇదేనా?
- పబ్లిసిటీ కోసం ఇంకా ఎంత మందిని బలి తీసుకుంటావు !
- బాబు పర్యటనపై ఎమ్మెల్సీ భరత్ ఫైర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: చంద్రబాబు పబ్లిసిటీ కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, 40 ఏళ్ల అనుభవం ఇదేనా? మీకు నేర్పిందని ఎమ్మెల్సీ భరత్ మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ కందుకూరు, గుంటూరు సంఘటనలు మరువక మందే చంద్రబాబు కుప్పం పర్యటనకు రావడం దారుణంగా ఉందన్నారు. 11 మంది అమాయకుల మృతి కారుకులైనా చంద్రబాబు ఇంకా ఎంత మందిని చంపాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదు.. తనకు అధికారం వస్తే చాలని ప్రభుత్వ జీఓను లెక్క చేయకుండా పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. కుప్పంలో చంద్రబాబు సభలకు పోలీసులు అనుమతి నిరాకరించారని వస్తున్న ఆరోపణలు అవాస్తవం అన్నారు. బాబు పర్యటనలో ఎలాంటి భద్రతలు తీసుకున్నారో? చెప్పాలని టీడీపీ నేతలను పోలీసులు సమాచారం అడిగారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినా జీఓలు ర్యాలీ, ప్రచార సభలను నిషేధించటం ఉద్దేశం కాదన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే ర్యాలీలు, ప్రచార సభలను భద్రతా ప్రమాణాలు తీసుకుని నిర్వహించాలన్నది మాత్రమే ఆ జీఓ ఉద్దేశమని చెప్పారు. 40 ఏళ్ల అనుభవం ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం జీఓలను గౌరవించడం తెలియక పోవడం దురదృష్టకం అన్నారు. ప్రజల ప్రాణాల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినా జీఓలపై ఎల్లో మీడియా తప్పడు ప్రచారం చేయడం తగదన్నారు. పబ్లిసిటీ కోసం చంద్రబాబు చేసినా మారణ హోమంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఎమ్మెల్సీ అన్నారు. ఇప్పటం గ్రామంలో అక్రమంగా నిర్మించిన గోడ కూల్చితే కాన్వాయి వేసుకుని రాద్ధాతం సృష్టించినా పవన్ కళ్యాణ్, 11 మందికి మరణానికి కారుకులైనా చంద్రబాబుపై నోరెత్తకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రంశాతంగా ఉన్న కుప్పంలో ప్రజలను రెచ్చగొట్టి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆయన ఆరోపించారు.

11న లోక్‌అదాలత్

చిత్తూరు అర్బన్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్‌శాఖ, పారాలీగల్ వలంటీర్లు, ఇతర సంబంధిత విభాగాల శాఖలు సమన్వయంతో అదాలత్ జరుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 9,801 కేసులను గుర్తించి, నోటీసులు ఇచ్చి, మధ్యవర్తిత్వం చేశామన్నారు. ఉచిత లోక్ అదాలత్ సెషన్ల ద్వారా కక్షిదారులతో చర్చించి, వివాదాలకు పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నామన్నారు.

మా ఉద్యోగాలు కాపాడాలని వినతి

కాణిపాకం(యాదమరి): తమ ఉద్యోగాలు నిలపెట్టాలని కాణిపాకం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. ఆలయంలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న 86 మంది ఉద్యోగులు గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబును వేర్వేరుగా కలసి వినతి పత్రాలు అందజేశారు. 18 ఏళ్ల ఆలయంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం తమని ఏజెన్సీలకు అప్పగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు మంత్రిని ఎమ్మెల్యేని కోరారు. దీనిపై మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి, సదరు అధికారులతో మాట్లాడి ఏజెన్సీలకు అప్పగిస్తే ఉద్యోగుల భద్రత ఉండదని, ఇప్పుడు ఎలా జరుగుతుందో అలాగే కొనసాగించాలని సూచించారు. దీనిపై మంత్రికి, ఎమ్మెల్యేకి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి పెద్దిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాణిపాకం ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సచివాలయ వ్యవస్థ.. ఇక దేశవ్యాప్తం

పెన్షన్ల పంపిణీలో మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: దేశ వ్యాప్తంగా సచివాలయ వ్యవస్థను తీసుకురావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. పుత్తూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కోవిడ్ వచ్చినా, వరదలు వచ్చినా సచివాలయ వ్యవస్థ ద్వారా నిమిషాల్లో సమాచారం అందుకోవడంతో పాటు తక్షణ సాయం అందించగలిగామని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రధానమంత్రి మోదీ సచివాలయ వ్యవస్థను దేశ వ్యాప్తంగా తీసుకురావడానికి ముందుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వైపు అన్ని రాష్ట్రాలు చూస్తున్నాయన్నారు. గతంలో పేదల గురించి ఆలోచించిన వారిలో ఎన్టీఆర్, వైఎస్సార్‌లు ఉంటే నేడు ఒక జగనన్న మాత్రమే వారి సరసన నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలో అమలు చేసిన అమ్మఒడి పథకం ఎంతగా ఆకట్టుకుంటుందంటే పొరుగు రాష్ట్ర సీఎం స్టాలిన్ సైతం తమిళనాడులో అమలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో తక్కువ పని చేసి, ఎక్కువ పబ్లిసిటీ చేసుకున్న నాయకుడ్ని చూశామన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు రూ.లక్షల కోట్లను వ్యయం చేస్తున్నా చెప్పుకోదగ్గ పబ్లిసిటీ చేసుకోవడం లేదన్నారు. ఇది ఆయన రాజకీయ వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీలు కె.మునస్వామిరెడ్డి, విమల, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.


పింఛన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

నవశకానికి నాంది.. వైఎస్సార్ పింఛన్ కానుక

–డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): నూతన సంవత్సరంలో వైఎస్సార్ పింఛన్ కానుక నవశకానికి నాంది అని, దానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం పెనుమూరులో ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని తూ.చ. తప్పకుండా నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమమే అజెండగా సీఎం పని చేస్తుంటే, ఈ సంక్షేమాలను అడ్డుకోవడమే ప్రధాన ధ్యేయంగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పెత్తనందారి, పేదవారి మధ్య పోరాటం జరగనుందని చెప్పారు. పెత్తనందారి వైపు చంద్రబాబు, పేదల వైపు జగన్‌మోహన్‌రెడ్డి పోరాటం చేస్తారని తెలిపారు. జగనన్న అందిస్తున్న పింఛన్లను చూసి ఓర్వలేక చంద్రబాబు పెన్షన్లను తొలగిస్తున్నారని ప్రజల్లో పుకార్లు పుట్టిస్తున్నారని, అది ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని చెప్పారు. అనంతరం జగనన్న చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. అలాగే చేనేత కార్మికుల నూతన క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ సభ్యురాలు యశోదారెడ్డి, నాయకులు రాజారెడ్డి, కృష్ణారెడ్డి, దూది మోహన్, మురళి, ఎంపీడీఓ శివయ్య, తహసీల్దార్ విజయకుమార్, ఏపీఎం హరి పాల్గొన్నారు.


పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి

బాబు పర్యటనకు వెళుతూ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుప్పం: చంద్రబాబు పర్యటనలో పాల్గొనేందుకు ద్విచక్రవాహనంలో కుప్పం వెళుతూ మద్యం మత్తులో బస్సును ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం శాంతిపురం మండలంలోని గుండిశెట్టిపల్లె సమీపంలో ఉన్న కర్ణాటక మద్యం షాపుల వద్ద పూటుగా తాగిన ఇద్దరు యువకులు బైకుపై నేరుగా పలమనేరు జాతీయ రహదారిపైకి వచ్చారు. మద్యం మత్తులో ఉన్న యువకులు వి.కోట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి షడన్ బ్రేకు వేసి బస్సును ఆపివేశాడు. కానీ అప్పటికే బైకు బస్సు కిందికి దూసుకుపోయింది. ఈ సంఘటనలో బైకుపై వెళుతున్న రామకుప్పం మండలం జోగిండ్లుకు చెందిన కుమార్(23), బైపరెడ్డపల్లెకు చెందిన నరేష్(20) గాయపడ్డారు. క్షతగాత్రులను కుప్పం ఆస్పత్రికి తరలించారు.

స్వాతంత్య్ర సమరయోధుని సతీమణి మృతి

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు శివరామాచారి సతీమణి కేఎస్ పద్మావతమ్మ(84) గురువారం మృతి చెందారు. బ్రిటీషు పాలనలో దేశ స్వాతంత్య్రంకోసం శివరామాచారి స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొనడంతో అప్పట్లో బ్రిటీష్ వారు ఆయనపై కేసు పెట్టి జైలులో ఉంచారు. ఆయన సతీమణి పద్మావతమ్మ మృతికి పట్టణంలోని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.


పద్మావతమ్మ(ఫైల్)

వినాయకునికి రూ.2 లక్షలు విరాళం


నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న పవన్ కుమార్


ఆలయాధికారులకు విరాళ చెక్కును అందజేస్తున్న నవ్యనాగరాజు కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి రూ.2 లక్షల విరాళాన్ని దాతల కుటుంబ సభ్యులు గురువారం ఆలయాధికారులకు అందజేశారు. ఉదయం విజయవాడకు చెందిన పవన్‌కుమార్ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన నవ్యనాగరాజు కుటుంబ సభ్యులు స్వామివారి నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు, గో సంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించి, చెక్కులను ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడుకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితుల ఆశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఛీ..ఛీ.. మరీ ఇంత అన్యాయమా!

పలమనేరు: టీడీపీ నాయకులు గురువారం మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరుకు చెందిన ఇద్దరు దివ్యాంగులు, వారి తల్లిని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయానికి పిలిపించి, వారితో అయ్యా.. తమకు పింఛన్ రాలేదని చెప్పించి, డ్రామా ఆడించి దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. కానీ ఇదంతా ఒట్టి డ్రామానేనని అధికారులు తేల్చారు. ఆ నిజాన్ని మళ్లీ సోషల్ మీడియాలో పెట్టి, నిరూపించారు. ఈ సంఘటన గురువారం పలమనేరులో హాట్ టాపిక్‌గా మారింది. ఇందుకు సంబంధించిన పచ్చినిజాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరుకు చెందిన వీరమ్మ(55)కు వితంతు పింఛను ప్రతినెలా రూ.2750, ఈమె కుమారులైన శంకరయ్య(25), లక్ష్మీనారాయణ(24)కు దివ్యాంగ పింఛన్లుగా ఒక్కొక్కరికి రూ.3 వేలు మొత్తం రూ.8,750 ప్రతినెలా అందుతోంది. ఈ నేపథ్యంలో పింఛన్ల సామాజిక తనిఖీలో భాగంగా గతనెల 27న గంటావూరు సచివాలయ అధికారి జలంధర్, వెల్ఫేర్ సెక్రటరీ శివకుమార్ వారికి సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ ఫారాలను ఇచ్చారు. గత నెల 28న వారి ఇంటిని కొలచి, రికార్డులోకి ఎక్కించారు. నిబంధనల మేరకు ఇల్లు ఉండడంతో పింఛన్లుకు అర్హులేనంటూ ఆన్‌లైన్‌లో వారికి పెన్షన్ మంజూరు చేశారు. ఈనెల ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే ఆ వార్డు వలంటీర్ సింధు, అక్కడి పంచాయతీ కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి ఆ కుటుంబంలోని ముగ్గురికి పింఛన్లను అందజేశారు. ఇందుకు సంబంధించి వారు సంతకాలు చేశారు. అయితే వారిని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఇకపై మీకు పింఛన్లు రావని బెదిరించినట్టు తెలిసింది. పింఛన్లు నమ్ముకుని బతికే తమకు వచ్చేనెల పింఛన్లు రావేమోనని వారు టీడీపీ నాయకులు సూచనలతో పట్టణంలోని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటి ముందు ఆర్తనాదాలు చేస్తూ వెళ్లి తమ కుటుంబంలో అందరికీ పింఛన్లు తొలగించారని చెప్పడం, ముందుగానే పథకం పన్నిన టీడీపీ నేతలు ఆ సంఘటనను వీడియో తీసి, సోషల్ మీడియా వైరల్ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, అక్కడి కౌన్సిలర్లు రవి, కన్వీనర్ జాఫర్ అక్కడకు వెళ్లి వాస్తవాలను మళ్లీ వారినోటే చెప్పించారు. వారు పింఛను తీసుకున్నట్టు ఆధారాలను సోషల్ మీడియాలో పెట్టారు. ప్రభుత్వం అర్హులకు పింఛన్లులిస్తున్నా తప్పుడు ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా టీడీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేస్తామని అధికారులు తెలిపారు. ఏదేమైనా టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలపై జనం అసహ్యాంచుకుంటున్నారు.


ఒకటో తేదీ లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజలకు మెరుగైన సేవలందించండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. గురువారం విజయవాడ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ జిల్లా ప్రగతిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఈక్రాఫ్ నమోదు వందశాతం పూర్తి చేయాలన్నారు. అర్హత ఉన్న రైతులు అందరికీ ఈ కేవైసీ, ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసి, రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు లబ్ధిదారుల ఎంపిక, పరికరాల అమరిక పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల ద్వారా వస్తున్న అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ప్రజాప్రతినిధులు సూచించిన మేరకు సంబంధిత పనులను పూర్తి చేయడంలో మరింత శ్రద్ధ చూపాలని తెలిపారు. జిల్లాలో సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా, గృహ నిర్మాణాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల పురోగతిని కలెక్టర్ హరినారాయణన్ సీఎస్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వెంటనే పూర్తి చేయండి

చిత్తూరు జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. గురువారం ఆయన విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో భారీ ప్రాజెక్టులు అమలు జరుగుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను పూర్తి చేసి, వెంటనే అప్పగించాలని ఆదేశించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో చిత్తూరు నుంచి నాయుడుపేట వరకు ఆరులేన్ల రహదారి నిర్మాణానికి చిత్తూరు జిల్లాలో భూసేకరణ పూర్తి అయిందన్నారు. రోడ్డు ఏర్పాటు కూడా పూర్తి అయిందని తెలిపారు. అలాగే బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో కొంతవరకు భూసేకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. భూసేకరణ, పరిహారం దాదాపుగా పూర్తి చేశామని తెలిపారు. చిత్తూరు–తచ్చూరు రహదారిలో మరో ఏడు కిలోమీటర్లు మాత్రమే అప్పగించాల్సి ఉందని, త్వరలో ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. అంతేగాక తచ్చూరు రహదారి నుంచి డీఆర్‌డీఓ ప్రాజెక్టుకు, చిత్తూరు నాయుడుపేట ఆరులేన్ల రహదారి నుంచి కాణిపాకం గ్రామానికి రహదారి కావాలని పలు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఆ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే భూసేకరణ పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ హరినారాయణన్, కార్యదర్శికి వివరించారు.

అంగన్‌వాడీ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంరక్షణ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ న్యూట్రీషియన్ కిట్, ప్రీస్కూల్ ఫిజీషియన్ యాక్టివిటీస్, 0 నుంచి 3 ఏళ్ల లోపు గల పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పిల్లలకు, గర్భిణులకు ఇస్తున్న పోషకాహారం వారే తీసుకుంటున్నారా? అన్న విషయాన్ని ఏ విధంగా పరిశీలిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను ఐసీడీఎస్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.